ప్రజాశక్తి
శుక్రవారం 9 మే 2025

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందించి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించడం ద్వారా సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సంబంధిత నిర్వాహకులకు సూచించారు. గుమ్మలక్ష్మీపురం గర్భిణీల వసతి గృహాన్ని శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణీలతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీశారు. కొండపై ఉన్న గిరిజన గర్భిణులు ప్రసవం సమయంలో రావడానికి ఇబ్బందిగా ఉంటుందని గుర్తించి గర్భిణీల వసతిగృహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గర్భిణీల వసతి గృహాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతిరోజు నడవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కురుపాం మార్కెట్ కమిటీ చైర్మన్ కడ్రక కళావతి, తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం

- వారం రోజుల్లో శ్యామలాంబ పండగ
- మౌలిక సదుపాయాలు కల్పన సాధ్యమేనా?
- మరుగుదొడ్ల మరమ్మతులు ఏమయ్యాయి?
- జనంలో జోరుగా చర్చోపచర్చలు

ప్రజాశక్తి-పార్వతీపురం, సాలూరు

ఈనెల 18 నుంచి 20వరకు మూడు రోజులు పాటు సాలూరు పట్టణంలో శ్యామలాంబ పండగ జరుగనుంది. ఇంకా వారం రోజులే గడువు ఉన్నా ఎక్కడా అభివృద్ధి పనులు కానరాకపోవడం పట్ల పట్టణ ప్రజల్లో చర్చ జరుగుతోంది. రెండు రోజుల క్రితం మున్సిపల్ కార్యాలయంలో ఒమంత్రి సంధ్యారాణి శ్యామలాంబ పండుగ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్,ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు.15 ఏళ్ళ తరువాత నిర్వహించనున్న పండగ కావడంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కానీ ఆ దిశగా ఎక్కడా పనులు చేపట్టిన దాఖలాలు లేవు.

శ్యామలాంబ పండగ నేపథ్యంలో పట్టణంలో వివిధ మౌలిక సదుపాయాల కల్పన కోసం 2 కోట్ల రూపాయలు మున్సిపాలిటీకి మంజూరయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 40 మున్సిపాలిటీ లకు ఈ నిధులు మంజూరయినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఈ నిధులు శ్యామలాంబ పండుగ కోసం తానే మంజూరు చేయించానని మంత్రి సంధ్యారాణి చెప్పారు. మార్చి 17న ఈ నిధులు మంజూరైతే ఇంత వరకు ఈ నిధులతో పట్టణంలో చేయాల్సిన అభివద్ధి పనులు చేయకపోవడానికి కారణమెవరనే చర్చ జరుగుతోంది. రెండు రోజుల క్రితం మున్సిపల్ కార్యాలయంలో శ్యామలాంబ పండుగ ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో మంత్రి మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పండగ నిమిత్తం పట్టణంలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణకు ఇబ్బంది లేకుండా పనులు చేయడానికి రెండు కోట్లు తీసుకొస్తే ఖర్చు చేయలేదని ఆమె మున్సిపల్ అధికారులను ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు మంజూరై రెండు నెలలైనా ఖర్చు చేయకపోవడం వెనుక అధికారపార్టీ పట్టణ నాయకుల వైఫల్యం కూడా ఉంది. రెండు కోట్ల రూపాయలతో ఏయే పనులు చేపట్టాలనేది కౌన్సిలర్ ల సిఫార్సు మేరకు అధికారులు ప్రతిపాదించాలి.ఈ పనులను కౌన్సిల్ లో ఆమోదించాలి. అయితే మంత్రి సంధ్యారాణి నామినేషన్ పద్ధతిలో తమ పార్టీ నాయకులతో పనులు చేయించాలని భావించినట్లు తెలిసింది. నామినేషన్ పద్ధతిలో పనులు చేపట్టడం కుదరదని, కౌన్సిల్ తీర్మానం మేరకే జరగాలని మున్సిపల్ అధికారులు స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ తతంగమంతా జరిగేసరికి పండగ ముహూర్తం సమీపించింది. గత నెలలో జరిగిన మున్సిపల్ సమావేశం లో ప్రతిపాదించిన పనులను కౌన్సిల్ ఆమోదించింది. ఆ పనులకు టెండర్లు పిలిచి మళ్ళీ కౌన్సిల్ లో ఆమోదించాల్సి వుంది. ఒకటి రెండు రోజుల్లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి రెండు కోట్ల రూపాయలతో పనులు ఆమోదించే లా చూస్తామని అధికారులు చెబుతున్నారు. సరిగ్గా 8 రోజుల్లో పండుగ ప్రారంభం కానుంది.ఈలోగా ప్రతిపాదించిన పనులు పూర్తి చేయడం కాంట్రాక్టర్ లకు, అధికారులకు కత్తి మీద సాము లాంటిదే. ఇలాంటి పరిస్థితుల్లో మంత్రి సంధ్యారాణి నిధులు ఖర్చు చేయకపోవడం వెనుక అసలు కారణాన్ని మరుగున పెట్టి అధికారులపై చిందులు వేయడం చర్చనీయాంశమైంది.

వారం రోజుల్లో మరుగుదొడ్ల మరమ్మతులు అయ్యేనా?

పట్టణంలో చాలా చోట్ల సామాజిక మరుగుదొడ్లు మరమ్మతుల కు గురై నిరుపయోగంగా మారాయి. గత మూడేళ్ళుగా ప్రజలు వీటిని వినియోగించడం లేదు. పట్టణంలో పేదలు ఎక్కువగా నివసించే మురికివాడలకు సమీపంలో ఈ సామాజిక మరుగుదొడ్లను నిర్మించారు. సరిగ్గా ఏడెనిమిది నెలల క్రితం మంత్రి సంధ్యారాణి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా మున్సిపల్ కార్యాలయం తనిఖీ చేశారు. ఆ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పట్టణం లో పాడైన సామాజిక మరుగుదొడ్ల ను వారం రోజుల్లో మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు. వెంటనే అధికారులు మరుగుదొడ్ల మరమ్మతు పనుల కు ప్రతిపాదన చేశారు. మున్సిపల్ జనరల్ ఫండ్ లో నిధుల్లేవని, మరుగుదొడ్ల మరమ్మతు పనులు చేపట్టలేమని చేతులెత్తేశారు. నిధులు లేకపోతే జిల్లా కలెక్టర్ అడిగి 20లక్షలు మంజూరు చేయిస్తానని మంత్రి సంధ్యారాణి హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు నిధులు మంజూరు చేయించలేదు. మరుగుదొడ్ల మరమ్మతు పనులు జరగలేదు. దీంతోశ్యామలాంబ పండుగ లోగా సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులు పూర్తయ్యే అవకాశం లేదు.

పట్టణంలోని 14 వార్డులోని అధ్వానంగా ఉన్న బంగారమ్మ కాలనీ నుంచి నెల్లిపర్తి వెళ్తే రోడ్డు

శ్యామలాంబ ఉత్సవంలో

శిథిలావస్థ భవనాలపైకి ఎక్కొద్దు

పండగ ఏర్పాట్లపై టెలీకాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జి కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

సాలూరు శ్యామలంబ జాతరలో శిథిలావస్థ భవనాలపై యాత్రికులు ఎక్కకుండా చూడాలని ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ ఎస్ఎస్ శోబిక అధికారులను ఆదేశించారు. శ్యామలాంబ ఉత్సవాల ఏర్పాట్లపై గురువారం సంబంధిత అధికారులతో ఇన్చార్జి కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 18 నుండి 20 వరకు మూడు రోజుల పాటు ఉత్సవం జరుగు తుందన్నారు. ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడా నికి అన్ని ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. సిరిమాను ఉత్సవంలో శిథిలావస్థ భవనాలపైన ప్రజలు ఎక్కి అవకాశాలు ఉంటాయని, అటువంటి భవనాలను గుర్తించి వాటి పైకి ఎక్కడాన్ని నిషేధించాలని సూచించారు. మూడు రోజుల పాటు తాగునీరు, విద్యుత్ సరఫరా నిరంతరంగా జరుపుటకు, పూర్తి స్థాయి పారిశుధ్యం నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టాలని అన్నారు. పరిస్థితిని పర్యవేక్షించడానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పండుగకు సుమారు 10 లక్షల మంది యాత్రికులు వస్తారని అంచనా ఉందని అన్నారు. సిరిమాను రథం చుట్టూ సరైన రక్షణకు సిబ్బంది ఉండాలని, మద్యం సేవించిన వారు దగ్గరకు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. బస్సులు ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు కొన్ని రూట్ల నుండి వస్తాయని, మక్కువ తదితర రూట్లలో వచ్చే వాహనాలు పట్టణంలోకి వచ్చే అవకాశాల్లేవని చెప్పారు.

రెండు పూటలా సరఫరాకు

తాగునీటిని రెండు పూటలా సరఫరాకు చర్యలు చేపడుతున్నామని, రెండు ట్యాంకర్ల ద్వారా నిత్యం సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు చెప్పారు. పారిశుధ్య నిర్వహణకు 119 మంది సిబ్బంది సిద్ధంగా ఉన్నారని, మరో 80 మంది సిబ్బంది అవసరమని తెలిపారు. ప్రస్తుత మూడు ట్రాక్టర్లు ఉన్నాయని, మరో ఐదు ట్రాక్టర్లు అవసరమని చెప్పారు. 50 మొబైల్ మరుగుదొడ్లను 16 ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఆర్ టి సి 10 రూట్లలో 148 బస్సులు నడుపుటకు ఏర్పాట్లు చేసినట్లు ఆర్ టి సి అధికారులు తెలిపారు.

14ప్రదేశాల్లో వైద్యశిబిరాలు

పట్టణంలో గుర్తించిన 14 ప్రదేశాల్లో వైద్య శిబిరాలను వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేస్తోంది. అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడానికి మూడు 108 వాహనాలను, 5 ఫీడర్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డి.శివకుమార్ తెలిపారు.

మద్యం నియంత్రణకు 5 చెక్పోస్టులను

మద్యం నియంత్రణకు 5 చెక్పోస్టులను ఏర్పాటు చేశామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి తెలిపారు. ఒక రిజర్వ్ పార్టీ మరో ఫ్లయింగ్ టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ శాఖకు సంబంధించిన పనులు దాదాపు పూర్తి చేశామని ఇఇ వేణుగోపాల నాయుడు తెలిపారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జ్ సబ్ కలెక్టర్ డాక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, డిఎస్పీ ఎం.రాంబాబు, డిపిఒ టి.కొండలరావు, జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్ కె శ్రీనుబాబు తదితర అధికారులు హాజరయ్యారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎపిఎస్ ఆర్‌టిసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపిఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు డిమాండ్ చేశారు. ఆర్టీసి యాజమాన్యం తీరుకు నిరసనగా మన్మధరావుతో పాటు సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు ఆధ్వర్యాన కార్మికులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు ఆర్టీసీ సంస్థ ఉత్తర్వులకు అనుగుణంగా జీతాలు చెల్లించాలని, మార్చి 12న డిపిటిఒ ఆఫీసులో ఏడుగురు కాంట్రాక్టర్లు, పార్వతీపురం, పాలకొండ, సాలూరు డిపోల మేనేజర్స్, కాంట్రాక్ట్ అవుట్ల సోర్సింగ్ యూనియన్ నాయకుల మధ్య జరిగిన చర్చల్లో ఆర్టీసీ సంస్థ ఉత్తర్వులకు అనుగుణంగా జీతాలు చెల్లిస్తామని, సెలవులు ఇతర సమస్యలు పరిష్కారం చేస్తామని అంగీకరించారని తెలిపారు. మూడు నెలలు అవుతున్నా అధికారులు ఒప్పందం అమలు చేయడం లేదని చెప్పారు. ఏప్రిల్ 23న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మె చేస్తామని పార్వతీపురం డిపో మేనేజర్‌కు తెలియజేసి 15 రోజులైనా పట్టించుకోలేదని అన్నారు. పైగా కాంట్రాక్టర్స్, డిపో మేనేజర్ కార్మికులను భయపెట్టి ఉద్యోగం నుంచి తీసేస్తామని బెదిరించడం చాలా అన్యాయమని అన్నారు. రాత్రి 5 గంటలకు డ్యూటీకి వెళ్లిన ఔట్సోర్సింగ్ కార్మికుడ్ని 24 గంటలు బయటకు పంపకుండా భయపెట్టి డ్యూటీ చేయించారని తెలిపారు. ఈ విధంగా కార్మికుల చేత 8 గంటలు కాకుండా 12 గంటల నుంచి 24 గంటల వరకు డ్యూటీ చేయించడం దారుణమని అన్నారు. కనీస కార్మిక చట్టాన్ని అమలు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. డిపోలో కార్మికులను మానసికంగా వేధిస్తున్నారని, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పారు. డిపో మేనేజర్ చొరవ చూపి కాంట్రాక్టర్‌తో మాట్లాడి డిపిటిఒ సమక్షంలో జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

డిపో ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

రూ.50 లక్షలతో లైటింగ్ ఏర్పాటు : సుడా చైర్మన్

ప్రజాశక్తి - వీరఘట్టం

వీరఘట్టం గ్రామ ప్రధాన రహదారి మధ్యలో సుడా ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సుడా చైర్మన్ కోరికాన రవికుమార్ తెలిపారు. గురువారం ప్రధాన రహదారిని పరిశీలించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఒట్టిగెడ్డ వంతెన నుంచి ప్రియాంక ఫిల్లింగ్ స్టేషన్ వరకు 1.75 కిలోమీటరు దూరంలో లైటింగ్ పనులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణతో మాట్లాడి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. లైటింగ్ పనులు పూర్తయిన తర్వాత కోడి రామ్మూర్తి నాయుడు విగ్రహాన్ని ప్రధాన రహదారి మధ్యలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సుడా చైర్మన్, ఎమ్మెల్యే, ఎస్ఇ సుగుణాకర్ రోడ్డు మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ప్లానింగ్ అధికారి అమర్నాథ్, కూటమి నాయకులు పి.కృష్ణమూర్తినాయుడు, ఉదయాన ఉదయభాస్కర్, బల్ల హరి, జామి లక్ష్మీనారాయణ, మాచర్ల అనిల్, జనసేన జానీ, ఎం.పుండరీకం, కె.ధర్మారావు, కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ అభివృద్ధే ధ్యేయం

పాలకొండ : స్థానిక నగర పంచాయతీ అభివృద్ధే తన ధ్యేయమని సుడా చైర్మన్ కోరికన రవికుమార్ అన్నారు. గురువారం స్థానిక నగర పంచాయతీలో గల వెంకటరాయిని కోనేరును పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులతో మాట్లాడి అభివృద్ధి కోసం చర్చించారు. వెంకటరాయిని కోనేరును పార్క్‌గా చేసేలా చూడాలన్నారు. అవసరమైన నిధులు తాను సమకూరుస్తానన్నారు. కూటమి ప్రభుత్వం నగర పంచాయతీ అభివృద్ధి చెందాలన్నారు. దీంతో పాటు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, వైస్ ఎంపిపి వాకుమూడి అనిల్, గంగునాయుడు, కొంచాడ అరుణ తదితరులు ఉన్నారు.

మ్యాప్‌ను పరిశీలిస్తున్న సుడా చైర్మన్ రవికుమార్, ఎమ్మెల్యే జయకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

మలేరియా ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ

మర్రిపాడు పిహెచ్‌సి, గర్భిణుల వసతిగృహంలో డిఎంహెచ్ఒ తనిఖీలు

ప్రజాశక్తి - సీతంపేట

జిల్లాలో మలేరియా ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులకు స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో మలేరియా, ఇతర ఆరోగ్య కార్యక్రమాలపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా ప్రభావిత గ్రామాల్లో అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. ఫీవర్ సర్వే పక్కగా చేపట్టి అక్కడే మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. జ్వరాలు సకాలంలో గుర్తించడంలో జాప్యం వహిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. మలేరియా మందుల లభ్యతపై ఆరా తీసి అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని డిఎంఒను ఆదేశించారు. దోమల నివారణా చర్యలకు చేపడుతున్న ఐఆర్ఎస్ పూర్తిస్థాయిలో జరిగేలా దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. గర్భిణుల వసతి గృహం (వైటిసి) సందర్శించి అక్కడ అందుతున్న సేవలపై పరిశీలించారు. ఎంసిపి కార్డులో గర్భిణీ ఆరోగ్య వివరాలు పరిశీలించారు. ఏఏ ప్రాంతాల నుంచి అడ్మిట్ అయ్యారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మర్రిపాడు పిహెచ్‌సిలో అందుతున్న సేవలపై సిబ్బందిని ఆరా తీసి రికార్డులు పరిశీలించారు. వైద్య తనిఖీల నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన గర్భిణీలతో మాట్లాడి ఆరోగ్యస్థితిని అడిగి తెలుసుకున్నారు. హైరిస్క్ గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పిహెచ్‌సిలో ఒఆర్ఎస్, మందుల లభ్యత పరిశీలించారు. మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉండాలన్నారు. అడ్డుబంగి గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఆరోగ్య కేంద్రాల్లో, క్షేత్ర స్థాయి స్థాయి సిబ్బంది అందుబాటులో ఉంటూ ముఖ ఆధారిత హాజరు (ఎఫ్ఆర్ఎస్) తప్పనిసరిగా సమయానికి వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కె.విజయపార్వతి, డిఎంఒ వై.మణి, వైద్యాధికారులు డాక్టర్ సోయల్, డాక్టర్ సత్యవేణి, డాక్టర్ శివశంకర్, సబ్ యూనిట్ అధికారులు, హెల్త్ సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులం... బిల్లులకు ఎంత కాలం?

అప్పల పాలవుతున్న అన్నదాతలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

అధికారు భరోసాతో వేలాది రూపాయలు ఖర్చు చేసి తమకున్న పాడి పశువులకు మినీ గోకులాల నిర్మించుకున్న పాడి రైతులకు బిల్లులందక ఇబ్బందులుపడుతున్నారు. పాడి పశువుల కోసం రైతులు తాటాకు కమ్మలతో గోసాలలను నిర్మించుకొని వాటిని ప్రతి మూడేళ్లకొకసారి మార్చుకుని వేయడంతో చాలా ఖర్చులు అవుతాయని వాటన్నింటిని అధిగమించి శాశ్వతమైన నిర్మాణాలు చేసుకోవడానికి ఆర్థిక సహాయాన్ని ఉపాధి హామీ నిధుల ద్వారా ప్రభుత్వమే అందిస్తుందని ప్రభుత్వం చెప్పింది. దీంతో అప్పులు చేసి మరీ ఈ మినీ గోకులాలను రైతులు నిర్మించుకున్నారు. ఈ మినీ గోకులాలకు ప్రభుత్వం 90 శాతం రాయితీతో నగదు చెల్లిస్తుందని ఆశతో అప్పులు చేసి మరీ వీటిని నిర్మించుకున్నారు. ఈ పథకంలో రెండు ఆవులు ఉన్న రైతులకు రూ.లక్షా 15 వేలు, నాలుగు ఆవులున్న పాడి రైతులకు రూ.1లక్షా 85వేలు, ఆరు ఆవులున్న పాడి రైతులకు రూ.2 లక్షల 35 వేలుగా మూడు రకాలుగా వర్గీకరించి రైతులు తమకు అనుకూలమైన పథకాలను ఎంచుకొని ప్రభుత్వ నిర్ణయించిన తమ వాటా కింద పది శాతాన్ని అప్పులు చేసి సమకూర్చుకున్నారు. మిగతా 90 శాతం నిధులు ప్రభుత్వం ఇస్తుందనే నమ్మకంతో వాటిని కూడా అప్పులు చేసి మరీ నిర్మించుకున్నారు. గత ఏడాది డిసెంబర్ వరకు ఈ నిధులను సక్రమంగానే చెల్లించారు. ఆ తర్వాత నుంచి బిల్లులు రాక ఇప్పుడు నిర్మించుకున్న రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వీటిని నిర్మించుకున్న పాడి రైతులంతా పేదలే కావడంతో వారి పాలిట ఈ పథకం శాపంగా మారింది. ప్రభుత్వము తమకు అప్పగించిన లక్ష్యాన్ని చేరువయ్యేందుకు పశు సంవర్ధక శాఖ వారు పాడి రైతులు ఉన్న గ్రామాల్లో ప్రతి రైతు వద్దకు వెళ్లి ఈ మినీ గోకులాలను నిర్మించుకునేలా వారిపై ఒత్తిడి తెచ్చి మరి నిర్మించారు. తీరా ఇప్పుడు బిల్లులు గురించి రైతులు అడగ్గా తమకు సంబంధం లేదని, ఆ నిధులు ఉపాధి హామీ పథకం నుండి చెల్లిస్తారని చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ మూడు నెలలుగా తిరుగుతున్నా ప్రయోజనం లేదని పాడి రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదికలు అందజేసి బిల్లులను తొందరగా రైతులకు చెల్లించేలా కృషి చేయాలని కోరుతున్నారు. బిల్లులు చెల్లింపుల్లో అలసత్వంతో నరేగా నిధులతో పలు పనులు అసంపూర్తిగా నిలిచిపోవడం గమనార్హం.

మండలంలో సుమారు 74 మినీ గోకులాల నిర్మాణం సాగిందని వీటి నిమిత్తం ఇప్పటి వరకు రూ.2కోట్లు వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తుంది. వీటి నిర్మాణం చేపట్టిన చాలా మంది పాడి రైతులు మొదటిలో చాలా ఆనందంతో తమ పశువులకు మంచి షెడ్లను వేసుకోవడానికి ప్రభుత్వం మంచి ప్రోత్సాహం ఇస్తుందని, ఆశపడి వీటి నిర్మాణం నిమిత్తం స్థానిక నాయకులు, అధికారులు చుట్టూ తిరిగి వాటిని మంజూరు చేయించుకున్నారు. తీరా మంజూరు చేసుకున్నాక తొందరగా వాటి నిర్మాణం చేపట్టాలని క్షేత్ర సహాయకులు రైతులను తొందర పెట్టారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తయితే బిల్లులు కూడా తొందరగా వస్తాయని చెప్పడంతో అప్పులు చేసి జనవరి నెలలో నిర్మాణాలను పూర్తి చేశారు. ఐదు నెలలు కావస్తున్నా నేటి వరకు బిల్లులు అందకపోవడంతో వాటికి వడ్డీలు పెరిగి నానా అవస్థలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు చెల్లింపులు చేయాల్సి ఉందని, గత నాలుగు నెలల నుండి ఒక్క నయా పైసా కూడా వీటి చెల్లింపులు కొనసాగించకపోవడంతో వడ్డీలు పెరిగిపోవడంతో తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలో 14 పాఠశాలల ప్రహరీ గోడలను నిర్మించారు. వాటికి కూడా బిల్లులు అందక గుత్తేదారులు ప్రభుత్వంపై అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ కింద పనులు చేస్తే తొందరగా బిల్లులు అవుతాయని ఆశపడి చేసిన పాడి రైతులకు, చిన్న చిన్న గుత్తేదారులకు చివరకు నిరాశే మిగిలింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించి తొందరగా బిల్లు చెల్లించేలా కృషి చేయాలని కోరుతున్నారు.

నిర్మాణం పూర్తయిన మినీ గోకులం

ప్రభుత్వం నుంచి నిధులు రాగానే చెల్లిస్తాం

మండలంలో చాలా పంచాయతీల్లో మినీ గోకులాలను ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలను పూర్తి చేశాం. వాటి బిల్లులు కూడా మా వద్ద అప్లోడ్ చేశాం. నగదును ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తే అప్పుడు వారి అకౌంట్లో పడతాయి, పాఠశాల ప్రహరీ గోడలు కూడా గుత్తే దారులకు చెల్లించాల్సిన 14 ప్రహరీ గోడలకు రూ.85 లక్షల వరకూ బిల్లులు అప్లోడ్ చేసి ఫైలును పంపించాం. ఇందుకు సంబంధించిన బిల్లులు కూడా తొందర్లోనే చెల్లింపులు జరుగుతాయి.

రామకృష్ణ నాయుడు,
ఎపిఒ, సాలూరు.

ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 12 నుంచి జరగనున్న వేపారమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా ప్రజలు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యగా గుమ్మలక్ష్మీ పురంలో సర్పంచి బొత్తాడ గౌరీ శంకర్రావు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ముఖ్యంగా గ్రామ వీధుల్లో విద్యుత్ కాంతులు ఉండేలా గురువారం పలు వీధుల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. మరోవైపు పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. వచ్చే ప్రజలు తాగు నీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు పైపులు మరమ్మతులు, ట్యాంక్ క్లోరినేషన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

8న జెడ్‌పి ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 75 సంవత్సరా వజ్రోత్సవాలు (1969-2020) జూన్ 8న నిర్వహించనున్నారు. ఈ మేరకు వజ్రోత్సవ కమిటీ సభ్యులు గురువారం పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్వగ్రామం ఎం.రాజపురంలో ఆహ్వానం పలికారు. ఎంపిపి ధమలపాటి వెంకటరమణ నాయుడు, జడ్పిటిసి జంపు కన్నతల్లి- ఉమామహేశ్వరరావు, స్థలదాత కుటుంబ సభ్యులు రౌతు రంగారావు తదితరులకు ఆహ్వానం పలికారు.

డంపింగ్ యార్డ్‌ను మార్చండి

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని ఓని -లుంబురు వెళ్లే దారిలో గల నగర పంచాయతీ డంపింగ్ యార్డ్ మార్చాలని వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాష్‌రావు, లుంబుర సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర కుమార్ గురువారం స్థానిక నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజును కోరారు. అక్కడ చెత్త వేసి పొగ పెట్టడం వల్ల మంటలు చెలరేగి తమ గ్రామాలకు పొగ వ్యాపించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కావును వెంటనే డంపింగ్‌యార్డు తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు స్వయం ఉపాధి ద్వారా అందించే ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన స్థానిక వైటిసిలో కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఎప్పుడు అండగా ఉంటుందని, ప్రభుత్వం స్వయం ఉపాధి కోసం కల్పిస్తున్న ఇటువంటి శిక్షణలను మహిళలు సద్వినియోగం చేసుకుంటే ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తమ కుటుంబాలను చక్కదిద్దుకోవచ్చని అన్నారు. శిక్షణలో రాణించి పలువురు మహిళలకు ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్ పర్సన్ కడ్రక కళావతి, మండల టిడిపి అధ్యక్షులు పాడి సుదర్శన్ రావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, ఎంపిడిఒ సాల్మన్‌రాజ్, నాయకులు నందివాడ కృష్ణబాబు, వెంపటాపు భారతి, తాడంగి రామారావు, అడ్డాకుల నరేష్, నిమ్మక సింహాచలం, అప్పలస్వామి, రాజేష్, చిన్న, సుబ్బలక్ష్మి, శిక్షణ కేంద్ర నిర్వాహకులు రాజేష్, వైటిసి, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ పార్వతీపురం మన్యం జిల్లా వారి ఆధ్వర్యంలో ఈనెల 9న స్థానిక భాస్కర్ డిగ్రీ కళాశాలలో జరగబోయే జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం టిడిపి కార్యాలయంలో జాబ్ మేళాకు సంబంధించిన గోడ పత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 10 బహుళ సంస్థల ప్రతినిథులు పాల్గొని అర్హులను ఎంపిక చేస్తారన్నారు. పదో తరగతి నుంచి పిజి వరకు చదివిన యువతీ యువకులు ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి అర్హతను బట్టి రూ.10వేలు నుంచి 20వేలు వరకు వేతనం లభిస్తుందన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, రౌతు వేణుగోపాలనాయుడు, నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -సాలూరు

స్థానిక మున్సిపాలిటీ పరిధిలో గల 11 కెవి ఫీడర్ పరిధిలో ఉన్న చెట్ల, కొమ్మలను తొలగించుటకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. గోపాలరావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో గల విద్యుత్తు లైన్లు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్ములను తొలగించుటకుగాను 11కెవి పరిధిలో గల కొంకివీధి., గాంధీనగర్, నెయ్యిలవీధి, బోను మహతివీధి, చిన్నవీధి, గాడివీధి. శివాజీ జంక్షన్, అక్కేనవీధి. బంగారమ్మకాలనీ, మజ్జిలపేట, నెలిపర్తి గానూ, 11 కెవి వాటర్ వర్క్స్ ఫీడర్ పరిధిలో ఉన్న జీగిరాం పురవీధుల్లో వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు. ప్రజల సహకరించాలని కోరారు.

చిట్టిపూడి వలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడివలసలో గురువారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, జ్వర పీడితులు, మధుమేహ రక్తపోటు, చిన్నారులు, తదితర రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ,ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూమి అప్పగింత

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో బిల్లమడ సమీపానున్న ఆక్రమిత భూమిని లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు అందజేశారు. తమ భూమిని కొంతమంది ఆక్రమించారని బాధితుడు వెంకటపతి రాజు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై బాధిత రైతు వెంకటపతి రాజుకు మరి కొంతమంది రైతులకు గురువారం భూమి హద్దులు చూపి అప్పగించినట్లు తహశీల్దార్ పి.అప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ విజయ గణేష్, సిఐ చంద్రమౌళి, ఎస్సై వై.అమ్మనరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులచే నీతికథలు బోధిస్తున్న గ్రంథాలయాధికారి ఇందిర

నీతి కథలతో నైతిక విలువలు

ప్రజాశక్తి -భామిని

విద్యార్థులు వివిధ నీతి కథలు చదవడం ద్వారా నైతిక జీవన విధానం అలవడుతుందని స్థానిక లైబ్రేరియన్ జి.ఇందిరా అన్నారు. భామిని గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పలు నీతి కథల పుస్తకాలను విద్యార్థులచే చదివించారు. తెలుగు బాషలో పలు సామెతలు చెప్పి, ఏఏ సందర్భాల్లో వాడతారో వివరించి, తెలుగు భాష గొప్పతనం గురించి వివరించారు. పుస్తక పఠనం రోజు వారి అలవాటుగా ప్రతి విద్యార్థి మలుచుకోవాలని సూచించారు.

విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ

పాలకొండ : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా గురువారం డ్రాయింగ్ మాష్టర్ గొర్లె మురళి షాడో డ్రాయింగ్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఒక ఫోటోలో మీరు గమనించినట్లుగా, ఒకే వస్తువులో కూడా, ఆ వస్తువు వివిధ తలాల కోణం, సమీపంలోని ఇతర వస్తువులు, వాటి ఉపరితలాల నుంచి నీడ భాగంలోకి ఎంత కాంతి తిరిగి ప్రతిబింబిస్తుందనే దానిపై ఆధారపడి, ఫారమ్ షాడోల తీవ్రత చాలా మార్చొచ్చని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ మండల వెంకట రమణ, బి.వాసు, ఇంచార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవ.. వెనుక డబ్బు యావ!

శిబిరాల పేరుతో పేదల మభ్యపెడుతున్న కార్పొరేట్ల మాయాజాలం

ప్రజాశక్తి - మక్కువ

ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చించి ఉచితంగానే కార్పొరేట్ ఆసుపత్రుల ద్వారా ఆరోగ్య సేవలందిస్తున్నప్పటికీ పలు ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రి వారు నిర్వహించే ఉచిత వైద్యశిబిరాల మాయలో పడి వారికి తెలియకుండానే మోసపోతున్నారు. ఉచితం పేరుతో ప్రజలకు వైద్యం సేవలందించే కార్పొరేట్ నెట్వర్క్ హాస్పటళ్లను, వైద్యులను తప్పకుండా అభినందించాల్సిందే. కానీ కొంతమంది ఉచితం పేరుతో శిబిరాలు నిర్వహించి వారి ఆసుపత్రులకు రోగులను రప్పించుకొని ప్రభుత్వం అందించే ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ద్వారా దండిగా దోచుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వపరంగా 104 లాంటి వాహనాలతో మొబైల్ సేవలు అందుతున్నప్పటికీ ప్రైవేటు ఆసుపత్రులు ప్రత్యేకంగా పిఆర్వోలను నియమించుకొని డబ్బులు వెదజల్లి ప్రకటనలు గుప్పించి గిరిజన ప్రాంతాల ప్రజలను లక్ష్యంగా చేసుకొని ఉచితం ఎరవేసి దోపిడీకి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసే సందర్భంలో వందకు

ఉచిత వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు (ఫైల్)

25మంది రోగులనైనా ఆసుపత్రులకు చేరితే చాలు వారి పంట పడినట్లేనని పలువురు ఆరోపిస్తున్నారు.కొందరైతే నేరుగా ఉచిత సేవలు అందిస్తామని నమ్మబలికి వాహనాల ద్వారా ఆసుపత్రికి వెళ్లాక రోగుల నుంచి వివిధ టెస్టుల పేరుతో డబ్బులు గుంజుకునే పరిస్థితి ఉందని పలువురు వాపోతున్నారు. అలాగే మందులు కూడా బయట కొనుక్కోమంటున్నారని చెబుతున్నారు. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా శస్త్రచికిత్స చేయాల్సి ఉన్నా అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్టు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా ఆసుపత్రులకు రోగులు కరువైనప్పుడు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం పరిపాటేనని పలువురు చర్చించుకుంటున్నారు.

శిబిరాల వద్ద ప్రైవేట్ ఆసుపత్రులు అందించే ఉచిత ఖరీదైన తనిఖీలను చూసి వారు చెప్పే మాయమాటలకు ప్రలోబపడి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి మోసపోకుండా ప్రభుత్వ రంగంలో ఉండే పెద్ద ఆసుపత్రులకు వెళ్తే ఎన్నో రకాలుగా మేలు చేకూరుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధిహామీ వేతనదారులు

ఉపాధి పనులు కల్పించాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలసలో కూలీలకు ఉపాధి పనులు కల్పించకుండా మండల సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు భూతాల మోహన్‌రావు మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ ఉపాధి, ఫారం ఫండ్ పనులు మాత్రమే చేయాలని బలవంతంగా చేయించేందుకు ఎంపిడిఒ, ఉపాధి హామీ సిబ్బంది ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఏప్రిల్ నెల ముందు ఫారం ఫండ్ పనులు చేయించారని, అయినా కావాలనే కూలీలను ఇబ్బంది గురిచేయడానికి ఫారం ఫండ్ పనులు చేయండి, లేకపోతే మానేయండని ఎంపిడిఒ బాధ్యతారాహిత్యంగా సమాధానం చెప్పారని, ఇది సరికాదని అన్నారు. ప్రభుత్వం ఒకవైపు ఉపాధి కూలీలకు ఎటువంటి ఆటంకం లేకుండా పని కల్పిస్తున్నామని ప్రకటనలు చేస్తుంటే దానికి అనుగుణంగా మండల ఉపాధి అధికారులు, ఎంపిడిఒ స్పందించడంలేదని విమర్శించారు. వెంటనే ఉపాధి కూలీలు కోరుకున్నచోట పనులు కల్పించాలని, లేకపోతే వచ్చే సోమవారం మొత్తం గ్రామంలోని వెయ్యి మంది కూలీలను కదిలించి పెద్ద ఎత్తున ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. మండల కేంద్రంలో పని కల్పించడానికి డ్వామా పీడీ చొరవ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెం ఖల్, నీలకంఠపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ కె.వి.ఎస్ పద్మావతి గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాలు, ఎన్‌సిడి, సిడి సర్వేలు గూర్చి వైద్య సిబ్బందికి అడిగి తెలుసుకొని నేరుగా రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు గూర్చి ఆరా తీశారు. అనంతరం మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల పల్లంబారిడిలో దోమల నివారణకు చేపడుతున్న ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ పర్యవేక్షించి స్ప్రేయింగ్ జరగబోయే గ్రామాలను సబ్ యూనిట్ అధికారులు ముంద

రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ పద్మావతి

స్తుగా తెలియజేసి క్షేత్ర స్థాయిలో ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టి జ్వరాలు ప్రబలకుండా చూసుకోని ఇంటింటికీ దోమల మందు పిచికారీ చేసిన ఇళ్లకు మార్కింగ్(ఎండార్స్మెంట్) పక్కాగా ఉండాలని సూచించారు. స్ప్రే చేస్తున్న సిబ్బంది మాస్క్,కళ్లజోళ్ళు,చేతి తొడుగులు ధరించేలా చూసుకుని ఐఆర్ఎస్ ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ బి.ప్రజ్ఞ, అమరసింహారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బికెఎంయు ఆందోళనలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి కోరుతూ ఈనెల 8 నుంచి 10వరకు వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) ఆధ్వర్యంలో దశల వారీ ఉద్యమాలు నిర్వహిస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బొత్స మోహనరావు, గరుగుబిల్లి సూరయ్య ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బెలగాం గొల్ల వీధిలో గల ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధి కూలీల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలా మండల స్థాయిని ఒక యూనిట్‌గా తీసుకొని నేరుగా సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలు పరిష్కరించేలా జిల్లాలో గల బికెఎంయు కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు, ఈ నెల 9, 10,11 తేదీల్లో మన నాయకులకు అందుబాటులో ఉన్న చెరువుల్లో చేస్తున్న ఉపాధి కూలీలు వద్దకు వెళ్లి సమస్యలపై చర్చించాలన్నారు. బిల్లులందక కూలీలు ఇబ్బందిపడుతుంటే రెండో పక్క ఐడిఎఫ్‌సి బ్యాంకుల్లో ప్రూఫ్ లేకపోవడంతో బిల్లులందడం లేదని, ఇవి అవ్వాలంటే విశాఖ, విజయవాడ వెళ్లాలంటే కూలీలకు తడిపి మోపుడు అవుతుందని అన్నారు. కావున ఐడిఎఫ్‌సి బ్యాంకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసి ఉపాధి సక్రమంగా బిల్లు అందేలా ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో నెలకొన్న బకాయిలను వెంటనే చెల్లించాలని, ప్రతి ఉపాధి శ్రామికునికి ఏడాదికి రూ.12 వేలు ఉపాధి భృతి ఇవ్వాలని, ఉపాధి హామీ కి రాష్ట్ర ప్రభుత్వం వాటా కేటాయించాలని, మెటీరియల్ కంపోనెంట్ 50శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించాలని, 200 రోజులు పని దినాలు కల్పించి, రోజు కూలీ రూ.700 ఇవ్వాలని, పనులు కల్పించి వలసలు ఆపాలని, సకాలంలో వేతనాలు ఇవ్వాలని, ఉపాధి హామీని ఇతర రంగాలకు మళ్లించరాదని తదితర డిమాండ్లపై ఈనెల 9,10,11 తేదీల్లో ఉపాధి హామీ పని ప్రదేశాలను జిల్లా బృందాలు ఎక్కడికక్కడ ఉపాధి కూలీలతో సమావేశం జరిపి సమస్యలు తెలుసుకొని, పరిశీలించి, ఉపాధి కూలీల సమస్యలపై ఈనెల 12న కలెక్టర్‌కు వినతులు సమర్పించాలని సమావేశంలో తీర్మానించినట్టు తెలిపారు.

సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైస్‌మిల్లు కార్మికులు

సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పాలకొండ

లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండలం తుమరాడలో రైస్ మిల్ కార్మికులు కరపత్రం విడుదల చేసి సమ్మె జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు పాలకొండ మండల కార్యదర్శి కాద రాము మాట్లాడుతూ రైస్ మిల్ కార్మికులకు 8 గంటల పని దినం, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యుటి తదితర కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో ఎనిమిది రైస్ మిల్లు ఉన్నాయని, ఇందులో పనిచేసే కార్మికులకు పీస్ రేటు వేతన ఒప్పందం యూనియన్ లేని మిల్లులు సక్రమంగా అమలు చేయడం లేదని అన్నారు. రైస్ మిల్ కార్మిక సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని, కావున మండలంలోని ఎనిమిది మిల్లులో ఉన్న కార్మికులు మే 20వ తేదీ సార్వత్రిక సమ్మెలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైస్ మిల్ యూనియన్ అధ్యక్షులు గేదెల సత్యం, కార్యదర్శి ఎడ్ల శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రేమ పేరుతో వంచించిన నిందితుడికి పదేళ్ల జైలు

బొబ్బిలి : ప్రేమ పేరుతో వంచించిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.15వేలు జరిమానా విధిస్తూ విజయనగరం మహిళా కోర్టు కమ్ 5వ ఎడిజె కోర్టు జడ్జి ఎన్.పద్మావతి గురువారం తీర్పు చెప్పారు. బొబ్బిలి మండలం సీతయ్యపేటకు చెందిన నిందితుడు దివనాపు అఖిల్ అంబేద్కర్ (29) పాచిపెంట మండలానికి చెందిన ఒకామెను ప్రేమిస్తున్నానని నమ్మించి, వంచించి, శారీరకంగా అనుభవించి పెండ్లికి నిరాకరించాడు. దీంతో బాధితురాలు బొబ్బిలి పోలీసు స్టేషనులో 2022లో కేసు పెట్టారు. అఖిల్ అంబేద్కర్ నేరానికి పాల్పడినట్లు రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఉపాధి పనులపై ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలంలోని ఉపాధి హామీ పనులపై ముఖ్యమంత్రి కౌన్సిల్ నిశిత పరిశీలన చేస్తోంది. ఈ మేరకు గురువారం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లావణ్య కుమార్ రెండు చెరువు పనులను పరిశీలించారు. పనిచేస్తున్న అక్కడ ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఉపాధి పనులు ఒక పూట చేసేలా అనుమతి ఇవ్వాలని, బిల్లులు తొందరగా పడేలా చూడాలని, పని వద్ద కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉపాధి కూలీలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ ఉపాధి బిల్లులు ఫిబ్రవరి 6 వరకు జరిగిన పనులకు గాను వారి అకౌంట్లో జమ అయ్యాయని, మిగిలిన పెండింగ్ బిల్లులు ఈ వారంలోగా జమ అవుతాయని తెలిపారు. అలాగే మౌలిక సదుపాయాల విషయం ప్రభుత్వ స్థాయిలో చర్చి జరుగుతుంది, త్వరలోనే కల్పిస్తారని అన్నారు. ఇక ఒక్క పూట పనులు చేయాలన్న విషయం ప్రభుత్వానికి తెలియజేస్తానన్నారు. ఆయన వెంట ఎపిఒ ఈగల తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

మస్తర్లను పరిశీలిస్తున్న సిఎం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు లావణ్యకుమార్

ఫీల్డ్ అసిస్టెంట్లు అంకితభావంతో పనిచేయండి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్లు అంకితభావంతో పనిచేస్తూ వేతనదారులకు పనులు కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. జిల్లా ఉపాధి హామీ పీడీ కార్యాలయం నుంచి జారీ అయిన నియామక పత్రాలను స్థానిక టిడిపి కార్యాలయంలో ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎమ్మెల్యే విజయ్ చంద్ర గురువారం అందజేశారు. వీరిలో పార్వతీపురం మండలం సూడిగం గ్రామ క్షేత్ర సహాయకులుగా సారధి లోకేశ్వరరావును, కృష్ణపల్లి గ్రామపంచాయతీ క్షేత్ర సహాయకులుగా కండ్యాన సావిత్రికి జాయినింగ్ ఆర్డర్ కాపీలను అందించారు. ఈ మేరకు నియామక పత్రాలు అందుకున్న క్షేత్ర సహాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు పనులు గుర్తించడంతో పాటు వేతనదారులకు సకాలంలో పనులు కల్పించి ఆ పనులు పూర్తయ్యేలా చూడాలని అన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి ఉద్యోగిని కూటమి ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. విధుల్లో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా మీ పై అధికారులను, తనను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, సిబ్బంది,పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ సమన్వయంతో ప్రకృతి సేద్యం

ప్రజాశక్తి - పాచిపెంట

రైతు సాధికారిక సంస్థ ప్రకృతి సేద్య ఉద్యోగులు, వ్యవసాయ శాఖ సమన్వయంతో పనిచేస్తేనే ప్రకృతి వ్యవసాయం విజయవంతంగా నడుస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖీ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని పాంచాలి సర్పంచ్ యుగంధర్‌తో కలిసి పిఎండిఎస్ నవధాన్య కిట్ల తయారీని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు నవధాన్య కిట్ల తయారీని వివరిస్తూ వ్యవసాయ శాఖ ద్వారా మూడు రకాల 10 కిలోల విత్తనాలను ప్రకృతి సేద్య బృందం ద్వారా 11 రకాల రెండు కిలోల విత్తనాలను కిట్లుగా తయారు చేసి ఎకరానికి 12 కిలోల నవధాన్య విత్తనాలను చల్లుకొనేలా రైతులకు అందిస్తున్నామని, వ్యవసాయ శాఖ ద్వారా ఇచ్చే కిట్లలో నాలుగు కిలోల జీలుగ, నాలుగు కిలోల కట్టే జనుము, రెండు కిలోల పిల్లి పెసర రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. ఎన్ని ఎక్కువ రకాల విత్తనాలను చల్లితే అంత ఎక్కువగా భూసారం పెరుగుతుందని, భూమిలో జీవ వైవిధ్యం పెరుగుతుందని అన్నారు. కావున రెండు కిలోల 11 రకాల విత్తనాలను కలిపి 14 రకాల 12కిలోల విత్తనాలను ఒక ఎకరానికి రైతుకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. భూమి పైనున్న మొక్కలను పశుగ్రాసంగా వాడుకోవచ్చని వేసవిలో పశుగ్రాసం కొరత తీరుతుందని, అలాగే కొన్ని రకాల ఆకుకూరలు, కాయగూరలు చల్లడం వల్ల ఇంటికి సరిపడా కూరగాయలు తీసుకోవచ్చని అన్నారు. నేల లోపల ఉన్న వేరు వ్యవస్థలు వివిధ రకాల సూక్ష్మజీవులకు నిలయంగా మారి అనేక రకాల పోషకాలను మొక్కకు అందిస్తుందని తెలిపారు. సర్పంచ్ యుగంధర్ మాట్లాడుతూ పిఎండిఎస్ నవధాన్యాలను అన్ని గ్రామాలకు విస్తరింప చేయాలని, దీని ఉపయోగాలను తెలుసుకోవాల్సిన అవసరం రైతులకు ఎంతైనా ఉందని ప్రకృతి సేద్య విస్తరణకు తమ వంతు కృషి తప్పకుండా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్య ఎంటి యశోదమ్మ, విఎఎలు, ప్రకతి సేద్య ప్రతినిధులు పాల్గొన్నారు.

నవ ధాన్యాల ప్రదర్శనను తిలకిస్తున్న ఎఎంసి చైర్మన్ సూర్యనారాయణ, అధికారులు

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి వరం

గుమ్మలక్ష్మీపురం : నేటి రోజుల్లో ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి వరం వంటిదని జిల్లా ప్రకృతి వ్యవసాయం మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని ఇరిడి రైతు భరోసా కేంద్రంలో నవధాన్యాల సాగు - నేలతల్లి బాగు అన్న నినాదంతో పిఎండిఎస్ 300 నవధాన్యాల కిట్లు తయారు చేశారు. ఖరీఫ్ సీజన్ నాటికి నవ ధాన్యాలు వరి పంటకు ముందు తేలికపాటి దుక్కులు వేసుకొని ఎకరానికి 12 కేజీలు చొప్పున వేసుకోవడం వల్ల నేలలో సూక్ష్మజీవులు వృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. అన్ని రకాల మొక్కల వేర్లు భూమిలోకి వెళ్లడం వల్ల నేల గుల్లబారి నేలలో నీటి సంగ్రహణ శక్తి పెరిగి వర్షాభావ పరిస్థితుల్లోనూ పంటల సాగుకు అనువైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. ప్రధాన పంటకు కావాల్సిన అన్ని రకాల సూక్ష్మ పోషకాలు అభివృద్ధి చెందుతాయని ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండిస్తే మన ఆరోగ్యాలు, భూమి తల్లి బాగుంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎఒ ప్రసాదరావు, ఎంటిఎల్ గణేష్, శరత్ చంద్ర, విఎఎ శివ, ఎంటిలు నరసింహ, నిర్మలాదేవి, ఢిల్లేశ్వరరావు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి సాలూరు

స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు, అవుట్ డోర్, విధుల్లో భాగంగా 6వార్డు అనాథ శరణాలయం వెనుక దాసరివీధి, తదితర వీధుల్లో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ డిటివి కృష్ణారావు, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దాసరవీధి, అగురువీధుల్లో నీటి సరఫరా చేసే పైప్‌లైన్లు బ్లాక్ అవ్వడంతో తాగునీటి సరఫరా కావడంలేదని స్థానిక ప్రజలు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి కమిషనర్ వెంటనే స్పందించి వాటర్ బ్లాక్ అయిన పైపులైన్లలను క్లియర్ చేసి తక్షణమే నీటిసరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. శ్యామలాంబ అమ్మవారు పండుగ జరగనున్న నేపథ్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ సిబ్బందితో లారీఓనర్ యూనియన్ ఆఫీస్ వద్ద నుంచి గాంధీనగర్ బ్రిడ్జి వరకు ఇరుప్రక్కల పెరిగిన పిచ్చిమొక్కలు, మట్టిదిబ్బలను జెసిబి సహాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో డిఇ ప్రసాదరావు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి -కురుపాం

ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఐదుగురు గాయపడిన సంఘటన గురువారం మధ్యాహ్నం కురుపాం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం గుమ్మలక్ష్మీపురం మండలం రాయఘడ జమ్ము గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై కురుపాం వస్తుండగా మరో ద్విచక్ర వాహనంలో దొరకెక్కువకు చెందిన తండ్రి, కూతురు కురుపాం నుంచి గుమ్మలక్ష్మీపురం వెళ్తున్నారు. పెళ్లివలస కూడలి సమీపంలో ఇరువురు వాహనాలు ఎదురెదురుగా వచ్చి బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. వెంటనే వీరిని స్థానికులు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.